# మినీ కథ

# భరించువాడు

డిసెంబర్ నెల కావటంతో మధ్యాహ్నం పన్నెండు గంటలు అయినా వాతావరణం చల్లగానే ఉంది. పాపం సూర్యుడు తానూ ఉన్నాను అని నిరూపించుకోవటానికి అన్నట్లుగా నామమాత్రంగా మబ్బుల చాటునుండి అప్పు డప్పుడూ బయటకు తొంగి చూస్తున్నాడు. సూర్యుడి డ్యూటీ తానుతీసుకున్నట్లుగా శేఖరం మనస్సు నిప్పులు చెరిగేంత వేడిగా ఉంది.

'ఎంత మోసం'! పదకొండోసారి అనుకున్నాడు కసిగా.

'నో! ఇలాంటివి జరగటానికి వీలు లేదు. ఇకముందు ఇలాంటిపన్లు చెయ్యకుండా సుశీలకు పాఠం చెప్పాలి' పళ్ళు నూరుకున్నాడు.

'అసలు నా ఆశయాలు ఏంటి? ఆదర్శాలు ఏంటి? అందాన్ని చూసి మోజుపడి సుశీలను పెళ్ళి చేసుకున్నందుకు నా ఆదర్శాలన్నీ మంట కలిపి మంచి శాస్తే చేస్తుంది'.

'నో! వీల్లేదు' దృఢంగా నిశ్చయించుకున్నాడు.

'సుశీల ఎప్పుడూ ఇంతే. పెళ్ళయిఆర్నెల్లు అయ్యింది. అప్పట్నుండి చూస్తూనే ఉన్నాను. చెప్పినప్పుడు చెయ్యనని తలూపుతుంది. మళ్ళీ మామూలు. మిగతా అన్ని విషయాల్లో ఎంతో అణకువగా మసలుకొనే సుశీల ఈ ఒక్క విషయంలోమా ఫ్రెండ్స్ముందు తలెత్తుకొని తిరగ నియ్యడం లేదు.'

'చూస్తాను. ఈ శేఖరమంటే ఏమను కుంటుందో. ఏమైనా సరే! ఇవ్వాళ రెడ్ హాండెడ్‌గా పట్టుకొని బాగా బుద్ధి చెప్పాలి'. తను ప్రొద్దుననగా వెళ్ళి సాయంత్రం దాకా రానని కదూ ఆమె ధైర్యం!

'వాడూ తను లేనిటైమ్ చూసుకొని మరీ వస్తాడు. ఆఫీసులేకుండా తను ఇంటిదగ్గర ఉండే రోజుల్లో ఇటు మొహంకూడా త్రిప్పిచూడడు.'

సుశీలమాత్రం!

తను ఇంట్లోలేనప్పుడు వాడికోసం ఎంత ఆత్రంగా చూస్తుందో, తానుఉన్నప్పుడుమాత్రం వీధిలోవాడు సైకిల్ బెల్ మ్రోగించుకుంటూ వెళ్తున్నాకూడా పట్టించుకోనట్లే నటిస్తుంది.

'పత్తిత్తు'! కసిగా తిట్టుకున్నాడు. 'ఎవరికి తెలియవు ఈ దొంగవేషాలు.'

'నిజమే ఫ్రెండ్సుదృష్టిలో ఎంత చులకనై పోయాడు సుశీల కారణంగా. ఊరుకుంటే వీల్లేదు. తనకుమాత్రం సహనం ఎన్నాళ్ళు ఉంటుంది.'

'అవును! తన సహనాన్ని పరీక్షిస్తుంది సుశీల.' తాను ఇన్నాళ్ళూ శాంతంగానే నచ్చ చెప్పాడు.

"సుశీలా! వాడు మన ఇంటికి రావటం నాకు ఇష్టం లేదని."

"అప్పుడుమాత్రం సారీనండి ఇకమీదట రావద్దంటాను అని బుద్ధిగా తలూపుతుంది. కాని షరా మామూలు. ఇంట్లో రోజుకొక క్రొత్తవస్తువు కనపడుతుంది. పిలిచి ఇదెక్కడిది అని అడిగితే అమ్మ కొనిపెట్టింది. అన్నయ్య కొనిపెట్టాడు అని తత్తరపడుతూ బెదురు బెదురుగా చెప్తుంది. తానేమో నమ్మినట్లు నటించాలి. వాడి దగ్గరే..."

'అవును తనకు తెలుసు సుశీల వస్తువులన్నీ వాడిదగ్గరే తీసుకొని ఉంటుంది.'

వీల్లేదు. ఇది ఏ మగవాడూ సహించలేని పని. ఇప్పుడు తాను ఇంట్లో ఉండనని వాడికి తెలుసు కాబట్టి వాడుఇప్పుడు ఇంటికి వచ్చుంటాడు.'

'అవును! వాళ్ళిద్దర్నీ రెడ్ హాండెడ్‌గా పట్టుకోవాలంటే ఇదే మంచిసమయం. ఇవ్వాళ తాడోపేడో తేల్చేస్తాను' కుర్చీని వెనక్కు జరిపి విసురుగా పైకిలేచి నుంచున్నాడుశేఖరం.

చుట్టూచూస్తే హాలు ఖాళీగాఉంది. ఓహ్! ఆలోచనల్లోపడి తను గమనించలేదు. లంచ్ టైమ్ కావటంతో అందరూ క్యాంటీన్‌కు వెళ్ళుంటారు అనుకున్నాడు.

ఒంట్లో బాగుండలేదని మేనేజర్ దగ్గర పర్మిషన్ తీసుకొని బయటకు నడిచి స్కూటర్ స్టార్ట్ చేసాడు.


* * *

'అదిగో! సైకిల్. నాకు తెలుసు. వాడు వచ్చే ఉంటాడని, వచ్చి ఎంతసేపైందో?' ఇటిం ముందు ఆగిఉన్న సైకిల్‌ను చూస్తూ కోపంగా అనుకున్నాడు. 'కావాలంటే తను డబ్బులు ఇయ్యనన్నాడా? ఎందుకు ఇలాంటి పనులు. సుశీలఒక్కతేనా? లేఆడవాళ్ళందరూ ఇంతేనా?' బాధగా కణతలు రుద్దుకున్నాడు శేఖరం.

తనఇల్లు ఉన్నసందు మెయిన్‌రోడ్ మలుపు దగ్గర స్కూటర్‌పార్క్ చేసి దానిమీద కూర్చొని ఉన్నాడు శేఖరం. అక్కడినుండి శేఖర్ ఇల్లు, బయట ప్రహరీ స్పష్టంగా కనబడుతున్నాయి. సందు మలుపు తిరగగానే సైకిల్ ఇంటిముందు కనిపించేసరికి ఇంక ఇంటికి వెళ్ళటానికి మనస్కరించలేదు శేఖర్‌కు.

'ఏమిత్రా? ఇక్కడున్నావ్?' భుజంమీద వెనకనుండి దెబ్బ పడేసరికి ఉలిక్కిపడి చూసాడు

"జగన్నాథం"




'ఓహ్! కొన్నాళ్ళక్రితం తను ఇదే విషయమై జగన్నాథాన్ని ఎగతాళి చేసాడు. అప్పటికి తనకింకా పెళ్ళికాలేదు. ఇప్పుడు తను ఈ విషయాన్ని జగన్‌కు చెప్తే నవ్వుకుంటాడా? వెక్కిరిస్తాడా?'

'ఊహూ! జగన్ తనలాంటి వెధవకాదు. తప్పకుండా ఏదో ఒక పరిష్కారం చెప్తాడు.

